క్లుప్తంగా

నేడు ఎస్ఎల్‌టీఏ సమావేశం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం 10గంటలకు తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డా ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్‌కుమార్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమావేశంలో భాషోపాధ్యాయుల సమస్యలు, భాషాపండితుల ఉన్నతీకరణ తదితర సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా, మండల స్థాయి సంస్థ సభ్యులు, భాషోపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు జడ్జి



కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్న జస్టిస్ శ్యాం సుందర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎంపిక



అక్బర్



భగత్ రవి

తిరుపతి సిటీ: తిరుపతి సీపీఎం కార్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ప్లీనరీ సమావేశాల్లో భాగంగా శనివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా అక్బర్, ప్రధాన కార్యదర్శిగా భగత్ రవి, ఉపాధ్యక్షులుగా వినోద్, తేజ, ఉమేష్, సహాయ కార్యదర్శులుగా సుష్మిత, నరేంద్ర, బాల, గురువయ్య ఎన్నికయ్యారు. మరో 10మంది కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి రవి మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యలపై విద్యార్థులను ఐక్యం చేసి పోరాటాలు చేస్తామన్నారు. ప్రధానంగా జిల్లాలోని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నికల్, టీటీడీ విద్యాసంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఎంప్లాయిస్ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: త్వరలో జరుగనున్న టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్ మీడియా సమావేశంలో ఆయన పోటీ చేయనున్న అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ బ్యాంక్ ఎన్నికల్లో టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున గుంటూరు రేఖ, వంకీపురం పవన్, సునీల్‌కుమార్ యాదవ్, ఎ.మణికంఠ పోటీ చేయనున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రకటించిన తమ అభ్యర్థులు గతంలో కరోనా విపత్కర సమయంలో ఆనందయ్య మందు, ఆక్సిజన్ సిలిండర్లు, పౌష్టికాహారాలు ఉద్యోగులకు అందించడంతో పాటు భక్తుల కోసం అన్నదానం, చలివేంద్రం ఏర్పాటుతో సేవలు అందించారని తెలిపారు. తమ అభ్యర్థులను ఆదరించి ఉద్యోగులు, బ్యాంక్ అభివృద్ధికి కృషి చేసే అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో పోటీ చేసే అభ్యర్థులతో పాటు సంఘ నాయకులు గోపికుమార్‌రెడ్డి, ఉమాశంకర్, గుణ, వెంకటేశ్వరబాబు పాల్గొన్నారు.

బీస్ నూతన కమిటీ ఎన్నిక



బీస్ జిల్లా నూతన కమిటీ కార్యవర్గం నాయకులు

తిరుపతి రూరల్ : బలిజ ఉద్యోగులు అభ్యుదయ సేవాసమితి(బీస్) కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సింగంశెట్టి మునిశంకరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో శనివారం ఉదయం 'బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి' (బీస్) కార్యవర్గ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సత్యనారాయణ నాయుడు, నీలం నరేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా తోకల అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా తోట మధుసూదన్, ప్రభురెడ్డి, సురేష్, చంద్రశేఖర్, బాలాజీ, జయప్రకాశ్, వంశీకృష్ణ, మోహన్, జాయింట్ సెక్రటరీలుగా పలువురిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

త్వరలో బలిజ వివాహ పరిచయ వేదిక..

పట్టణంలో బలిజ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షులు మునిశంకరయ్య, నీలం నరేంద్రనాథ్ తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలలు ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్నాయి. తొలిసారి ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలు అటానమస్ హోదాలో సీట్లు భర్తీ చేయనున్నాయి. కొత్త కోర్సులు.. కొత్త విధానాలతో విద్యార్థులను సమోన్నతంగా తీర్చిదిద్దనున్నాయి. ఈ మేరకు సోమవారం నుంచి మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నాయి.





ఎస్వీ ఆర్ట్స్ కళాశాల భవనం

నూతన కోర్సులతో భవిష్యత్‌కు భరోసా

- అటానమస్ హోదాలో అడ్మిషన్లు
- రేపటి నుంచి టీటీడీ డిగ్రీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు
- సీట్లు సాధించిన విద్యార్థుల జాబితా విడుదల
- ఉపాధి కల్పనే లక్ష్యంగా నూతన విద్యావిధానం

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలు అటానమస్ హోదాలో తొలిసారి అడ్మిషన్లకు సిద్ధమయ్యాయి. 2024–25 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు శనివారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా కళాశాల ప్రిన్సిపల్స్‌కు జాబితా అందింది. దీంతో తొలిసారి అటానమస్ సాధించిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్ కళాశాల, ఎస్‌పీడబ్ల్యూ డిగ్రీ కళాశాలల్లో సోమవారం నుంచి మొదటి విడత అడ్మిషన్లు జరగనున్నాయి. యువతకు వంద శాతం ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన డిగ్రీ ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇంటర్మీడియెట్, తత్సమాన పరీక్షల్లో సాధించిన మార్కుల శాతం ఆధారంగా టీటీడీ విద్యాసంస్థల్లో ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విభాగాలలో సీట్లు కేటాయించారు.

రేపటి నుంచే ప్రవేశాలు



“ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సోమవారం కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆర్ట్స్, సైన్స్, కామర్స్ గ్రూప్‌లకు సంబంధించి 19 సబ్జెక్టులలో 1068 సీట్లకు ఏటా మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం అడ్మిషన్లు జరుపుతున్నాం. డిగ్రీ చదువుతున్న అన్ని సంవత్సరాల విద్యార్థులకు కలిపి సుమారు 1400 మందికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నాం.

– డాక్టర్ సత్యనారాయణ, ప్రిన్సిపల్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

అడ్మిషన్లకు సర్వం సిద్ధం



ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి మొదటి విడత సీట్లు కేటాయింపు ప్రక్రియ శనివారం పూర్తయింది. సోమవారం నుంచి అడ్మిషన్లు చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశాం. కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి 22 సబ్జెక్టుల్లో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాలలో 1470 సీట్లు ఉన్నాయి. టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు నాలుగేళ్లకు సంబంధించి మెరిట్ విద్యార్థులకు రిజర్వేషన్ల ప్రాతిపదికన మొత్తం 1800 మందికి ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తున్నాం.

– ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

అటానమస్ హోదాలో తొలిసారి..



టీటీడీ అధికారులు, కళాశాల సిబ్బంది సహాయ సహకారాలతో పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల అటానమస్ హోదా పొందింది. తొలిసారి అటానమస్ హోదాలో డిగ్రీ అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సీట్లు సాధించిన విద్యార్థులకు ఇప్పటికే సమాచారం అందించారు. కళాశాలలో ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విభాగాలలో 21 సబ్జెక్ట్‌లకు సంబంధించి 1550 సీట్లు భర్తీ చేయబోతున్నాం. నాలుగేళ్లకు కలిపి మొత్తం 2100 మంది విద్యార్థినులకు హాస్టల్, ఉచిత భోజన వసతి కల్పిస్తున్నాం.

– డాక్టర్ నారాయణమ్మ, ప్రిన్సిపల్, పద్మావతి కళాశాల, తిరుపతి

సమాజానికి మార్గదర్శకులు గురువులు



మాట్లాడుతున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి కల్చరల్: సమాజానికి దిశ, దశను చూపే ఉపాధ్యాయవృత్తిని చేపట్టడం పూర్వజన్మ సుకృతమని, సమాజం దశ, దిశను చూపే మార్గదర్శకులు గురువులు ఉండాలని సంస్కృతి విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో శనివారం ఉపాధ్యాయులతో శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం భారతీయ విద్యాభవన్ సంచాలకుడు సత్యనారాయణ రాజు, ఆచార్య రఘురామరాజు, వశిష్ట సాధువులు, రాజమహేంద్రవరానికి చెందిన స్వామి శశికాంతానందజీ మాట్లాడుతూ తన దివ్యసందేశంతో విద్య పరిపూర్ణతను ఆవిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, ఉపాధ్యాయులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణ

చంద్రగిరి: పంచాయతీల అభివృద్ధిపై ఈనెల 12 నుంచి 14వ వరకు మూడు రోజుల పాటు మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ సూర్యసాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతులలో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అనే అంశాలపై రిసోర్స్ పర్సన్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు.

పాకాలలో..

పాకాల : మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు పంచాయతీల నిర్వాహణపై 3 రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ మాలతి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మట్లాడుతూ జిల్లా అధికారుల సూచనల మేరకు రేపటి నుంచి 3 రోజుల పాటు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజానాట్య మండలి నేతలు

తిరుపతి కల్చరల్: కేరళలోని వయనాడ్‌లో వరదల్లో చిక్కుకున్న బాధితులకు మానవతావాదులు విరివిగా విరాళాలు ఇచ్చి ఆదరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని పద్మావతి పార్క్ నుంచి చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్ ప్రాంతంలో సుమారు 350 మందికిపైగా చనిపోవడం, 100 మందికి పైగా గల్లంతు అయ్యారని తెలిపారు. వయనాడ్ ప్రాంతాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేత రామానాయుడు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏఐటీయూసీ నేతలు గోవిందస్వామి, అల్లాబక్షు, రాము పాల్గొన్నారు.

టీటీడీ అధికారులకు నోటీసులు

తిరుమల: టీటీడీ నిధులతో తిరుపతి, తిరుమలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి 55 మంది టీటీడీ అధికారులకు రాష్ట్ర విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీచేశారు. టీటీడీ నిధులతో తిరుపతిలో రోడ్లు, విద్యుత్ పనులు చేయించారని, తిరుమలలో కూడా కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు టీటీడీలో పలు విభాగాల అధికారులకు, సిబ్బందికి నోటీసులు ఇచ్చారు. ఈ పనులకు సంబంధించి పూర్తి వివరాలను తమకు తెలియజేయాలని అందులో పేర్కొన్నారు.

బకాయిలను తక్షణం చెల్లించాలి



మాట్లాడుతున్న ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు అరియర్స్ బకాయిలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మీరయ్య మాట్లాడారు. ఏడో వేతన సంఘం సిఫార్సు మేరకు 2016 నుంచి అమలు చేయాల్సిన వేతన సవరణను 2017లో అమలు చేసి ఒక ఏడాది అరియర్స్ పెండింగ్ పెట్టడం జరిగిందన్నారు. అరియర్స్ బకాయిలతో పాటు రావాల్సిన 18 నెలలకు సంబంధించిన డీఏలను చెల్లించలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇంక్రిమెంట్ అమలు చేయలేదన్నారు. సమావేశంలో ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పులివర్తి రవీంద్ర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.మనోహరం, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

సాహితీవేత్తల వెతలు



ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరునగరి ఎందరో కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు నిలయం. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత మహాకవి శంకరంబాడి సుందరాచార్యులు జయంతి సందర్భంగా మున్సిపల్ అధికారులు తిరుపతిలో సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో సాహితీవేత్తలు శంకరంబాడి విగ్రహం వద్ద నివాళులు అర్పించే క్రమంలో అవస్థలు పడ్డారు. పట్టణంలోని లక్ష్మీపురం సర్కిల్ వద్ద శ్రీనివాస సేతు పనుల వల్ల విగ్రహాన్ని ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేశారు. అయితే అక్కడ నిచ్చెన ఏర్పాటు చేయకపోవడంతో సాహితీవేత్తలు అవస్థలు పడుతూ నివాళులు అర్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





తిరుపతిలోని లక్ష్మీపురంలోని సర్కిల్ శంకరంబాడి విగ్రహం వద్ద నివాళులు అర్పించేందుకు వచ్చిన సాహితీవేత్తల అవస్థలు


గిండీస్‌లో ఘనంగా ఆదివాసి దినోత్సవం



మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న గిండీస్ అకాడమీ డైరెక్టర్లు

తిరుపతి సిటీ: స్థానిక ఎమ్మార్ పల్లి సర్కిల్‌లోని డాక్టర్ గిండీస్ ఐఏఎస్ అకాడమీలో శనివారం ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు అళహరి పాపారావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల వైవిధ్య భరితమైన సంస్కృతీ, సంప్రదాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసిందన్నారు. 1994 నుంచి ఏటా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గిండీస్ అకాడమీ డైరెక్టర్లు డాక్టర్ సురేష్‌కుమార్ గిండి, విజయకుమార్ గిండి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు విరివిగా వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(అలిపిరి): విశ్రాంత ఉద్యోగులకు మూడునెలలకోసారి వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారం తిరుపతిలోని ఎన్జీఓ హోంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తమ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. తమకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పెన్షనర్ల సంఘం పేరిట దౌర్జన్యంగా భవనాన్ని నిర్మించారని ఎమ్మెల్యే దృష్టికి రిటైర్డ్ ఉద్యోగులు తీసుకొచ్చారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, రమణరాజు, జనసేన నాయకులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలోనే బంగారు భవితకు బాటలు



కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినుల బంగారు భవితకు బాటలు వేస్తుందని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున్ తెలిపారు. మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు శనివారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ, అధునాతన ల్యాబ్‌లు, నిపుణులైన అధ్యాపక బృందం, గ్రంథాలయాలు, స్పోర్ట్స్, హాస్టల్ వసతి, భద్రత వంటి అన్ని సదుపాయాలు పుష్కలంగా వర్సిటీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. లక్ష్యసాధనకు విద్యార్థినులు శ్రమించి వర్సిటీ, కుటుంబసభ్యులకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పలు విభాగాల అధిపతులు వర్సిటీలో ఉన్న సదుపాయాలు, అవకాశాలపై సమగ్ర సమాచారాన్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ కాత్యాయిని, ప్రొఫెసర్ త్రిపురసుందరి, ఆర్.శైలేశ్వరి, జీవనజ్యోతి, నాగరాజు, సారా సరోజిని, సీతాకుమారి, జి సావిత్రి, నీరజ, సుప్రియ, రమజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు నైట్ స్వీపింగ్



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు, యాత్రికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు నైట్ స్వీపింగ్ చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. శనివారం ఆమె కచ్చపి ఆడిటోరియంలో మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నగరానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, అందుకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రధాన మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించే పనులు ఈ నెల 13 నుంచి ప్రారంభించి నెలాఖరు లోపు పూర్తి చేస్తామన్నారు. నగరంలో 128జీవీపీ (గార్బేజ్ వనరబుల్ పాయింట్స్) లను గుర్తించామని, రాత్రి, ఉదయం డ్యూటీలకు వెళ్లేవారు ఇక్కడ చెత్త వేసి వెళ్తుండడం దారుణమన్నారు. నగరంలో 200కు పైగా ఖాళీ స్థలాలను గుర్తించామని శుభ్రం చేయాలని నోటీసులు ఇస్తున్నామని అన్నారు. నగరపాలక సంస్థలో పన్నులు పెండింగ్ ఉన్నాయని వాటిని కలెక్ట్ చేయడంపై దృష్టి సారించాలని అన్నారు. నగరంలో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కచ్చపి ఆడిటోరియం అందరికీ అందుబాటులో ఉండేలా ధరలు తగ్గించామన్నారు. స్మార్ట్ స్ట్రీట్లు ఆక్రమణకు గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

అద్వితీయం.. రంగస్థలి కళోత్సవం..



శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి జాతీయ స్థాయి నృత్య కళోత్సవ పోటీలలో భాగంగా రెండవ రోజైన శనివారం మహతి కళాక్షేత్రంలో కళాకారులు చక్కటి అభినయంతో అద్వితీయంగా ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్య కళా కళా ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నృత్య కళోత్సవ పోటీలకు రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల ప్రాంతాల నుంచి సుమారు 100 మందికిపైగా కళాకారులు పాల్గొని శాస్త్రీయ, జానపద నృత్యాలను ప్రదర్శించి అలరింపజేశారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎన్ రాజా, రంగస్థలి కళాకారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు



ఆలయం వెలుపల నల్గొండ ఎంపీ కిరణ్‌కుమార్, మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసులు, తెలంగాణ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే సత్యవతి రాథోడ్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, కర్నూలు డీఐజీ ప్రవీణ్

తిరుమల: నల్గొండ ఎంపీ కిరణ్ కుమార్, మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసులు, తెలంగాణ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే సత్యవతి రాథోడ్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, కర్నూలు డీఐజీ కె.ప్రవీణ్ తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి నీచమైన చర్య

తిరుపతి కల్చరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ సృష్టికర్త బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ అల్లరిమూకలు దాడి చేయడం నీచమైన చర్య అని వైఎస్సార్ వీరాభిమాని బొమ్మగుంట రవి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఆత్మగౌరవం కాపాడిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. బరి తెగిస్తున్న కూటమి ప్రభుత్వ కుట్రలను బడుగు, బలహీనవర్గాల వారు ఐక్యతతో ఖండించకుంటే రాష్ట్రంలో మన బతుకులు మరింత దిగజారుతాయని తెలిపారు.

విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం



ముఖ్యఅతిథులను సత్కరిస్తున్న అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కళాశాల పని చేస్తుందని ఎస్వీసీఈ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకరరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో బీటెక్ తొలి ఏడాదిలో అడ్మిషన్లు పొదిన సీఎస్ఈ విభాగం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా తోప్పన్నేర్రిల్ సంస్థ టెక్నికల్ ఆర్కిటెక్ ఏ.యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధితో పాటు, వ్యాపార రంగంలో అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.